ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 20.01.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ లో ఈరోజు నుంచి 5 రోజుల పాటు జరగనున్న 55వ ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో పాల్గొననున్నారు.
2. గతంలో నీటి పారుదల శాఖ మంత్రులుగా పని చేసిన బిఆర్ఎస్ నేతలు తారకరామారావు, హరీశ్ రావు లు బ్రిజేష్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును అంగీకరించి రాష్ట్రానికి అన్యాయం చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు.
3. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం BRS హయాంలో అమలు చేసిన అనేక పథకాలను నిలిపివేసిందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారకరామారావు విమర్శించారు.
4. నాగర్ కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలో గనుల తవ్వకాలను వ్యతిరేకిస్తూ నిరాహార దీక్షకు సిద్ధమైన రైతులను పోలీసులు అరెస్టు చేశారు.

**ముఖ్యమంత్రి దావోస్ పర్యటన**

తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్విట్జర్లాండ్ లోని దావోస్ లో ఈ రోజు నుంచి ఐదు రోజుల పాటు జరగనున్న 55వ ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సుకు హాజరు కానున్నారు. తెలంగాణాకు ఉన్న సానుకూలతలను వివరించి హైదరాబాద్‌ను పెట్టుబడులకు గమ్య స్థానంగా మార్చడమే లక్ష్యంగా ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ముఖ్యమంత్రి వెంట ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు

అధికారులు ఉన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ కు పెట్టుబడులు తీసుకురావడమే ధ్యేయంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం దావోస్ చేరుకున్నారు.

డెస్క్

**ఉత్తమ్**

నదీ జలాల విషయంలో రాష్ట్ర హక్కులను కాపాడేందుకు కృషి చేస్తున్నామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈరోజు నల్లగొండ జిల్లాలో పర్యటిస్తున్న మంత్రి గత BRS ప్రభుత్వ హయాంలో కృష్ణాజలాల పంపిణీలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామన్నారు. గతంలో నీటి పారుదల శాఖకు మంత్రులుగా పనిచేసిన తారకరామారావు, హరీశ్ రావులు తెలంగాణకు 299 టీఎంసీలు , ఆంధ్రప్రదేశ్ కు 512 టీఎంసీలు కేటాయిస్తూ బ్రిజేష్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును ఒప్పుకొని సంతకాలు చేసి వచ్చారని విమర్శించారు. తాము ఆ తీర్పును వ్యతిరేకిస్తూ , తెలంగాణ తరఫున న్యాయపరమైన వాదనలు వినిపిస్తామని మంత్రి తెలిపారు.

పిటిసి, నల్లగొండ

**కేటీఆర్ విమర్శలు**

ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో అన్నీ కోతలే విధించిందని , పథకాల ప్రయోజనాలకు ప్రజలను దూరం చేస్తోందని BRS కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు విమర్శించారు. BRS హయాంలో అమలు చేసిన అనేక పథకాలను నిలిపివేశారని ఆరోపించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ లో ఈరోజు పోస్ట్ చేశారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, నీటి పారుదల ప్రాజెక్టులు , బాలింతలకు KCR కిట్లు, పౌష్టికాహార కిట్లు తదితర పథకాల గురించి ఆయన ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మహిళలకు మహాలక్ష్మి పేరిట 2 వేల 5 వందల రూపాయల ఆర్థిక సాయం , తులం బంగారం, అమర

వీరుల కుటుంబాలకు ఫించన్లు , కౌలు రైతులు , ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఆర్థిక సాయం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని అన్నారు.

డెస్క్

**బీఆర్ఎస్ ధర్నా**

నల్లగొండ జిల్లాలో BRS కార్యనిర్వాహక అధ్యక్షుడు తారకరామారావు రైతులతో కలసి నిర్వహించ తలపెట్టిన మహాధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో హైకోర్టును ఆశ్రయించేందుకు ఆ పార్టీ నేతలు సన్నద్ధమవుతున్నారు. ధర్నాకు అనుమతి ఇవ్వకుంటే రేపటి నుంచి నిర్వహించనున్న గ్రామసభలే వేదికగా నిరసన తెలియజేస్తామని ఆ పార్టీ నాయకులు తెలిపారు.

**పిటిసి, నల్గొండ**

**కాల్పుల ఘటన**

అమెరికాలో వాషింగ్టన్ లో నిన్న జరిగిన కాల్పుల ఘటనలో హైదరాబాద్ కు చెందిన యువకుడు ప్రాణాలు కోల్పోయారు. ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో నగరంలోని చైతన్య పురికి చెందిన కొయ్యాడ రవితేజ మృతి చెందారు. 2022లో అమెరికా వెళ్లిన రవితేజ మాస్టర్స్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. రవితేజ స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామం కాగా అతని తల్లి దండ్రులు హైదరాబాద్ లో ఉంటున్నారు

పిటిసి, యాదాద్రి భువనగిరి

**గ్రామసభలు**

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా సంక్షేమ పథకాల అమలుకు గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మండల స్థాయి అధికారులకు

ఈరోజు ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 21  నుంచి అన్ని గ్రామాల్లో సభలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త రేషన్ కార్డుల ప్రభుత్వం రూపొందించిన జాబితాలో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.  రేపటి నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ప్రతీ రోజు ఒక గ్రామ పంచాయతీలో మాత్రమే గ్రామ సభలు నిర్వహించాలని, గ్రామ సభలకు హాజరయ్యే ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ సంక్షేమ పథకాలు అందుతాయని ఈ విషయంలో ఎలాంటి ఆందోళనలు అవసరం లేదని అన్నారు.

పిటిసి, నిర్మల్ - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:

**దామోదర రాజనర్సింహ**

విద్యాసంస్థల భవన నిర్మాణ పనులను నాసిరకంగా చేపడితే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ హెచ్చరించారు. నిన్న సంగారెడ్డి జిల్లాలో అందోల్ నియోజకవర్గంలో వివిధ విద్యా సంస్థల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మహిళా పాలిటెక్నిక్ కళాశాల , వెటర్నరీ కళాశాల, కొత్తగా నర్సింగ్ కాలేజీ భవనం, హాస్టల్, హాస్పిటల్ అందుబాటులోకి తీసుకువచ్చి.. మహిళా విద్యా కేంద్రంగా ఆందోల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి చెప్పారు. పుల్కల్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ, పుల్కల్, అందోల్ మండలాల్లోని ఆదర్శ పాఠశాలలు , గురుకుల పాఠశాలలు , పాలిటెక్నిక్ కళాశాల , నర్సింగ్ కాలేజీలను సందర్శించారు.

పీటీసీ, సంగారెడ్డి

**పరీక్షల ఒత్తిడి**

గంజాయి, మత్తు పదార్థాలను అడ్డుకోవడంతో విద్యార్థులు భాగస్వామ్యం అవసరమని, పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమించడానికి యోగ, ధ్యానం లాంటివి అలవర్చుకోవాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణం పద్మనాయక ఫంక్షన్ హాల్లో విద్యార్థులకు పదవ తరగతి పరీక్షలు , గంజాయి తదితర మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**బర్డ్ వాచ్ ఫెస్టివల్**

ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ , పెంచికలపేట, బెజ్జూర్, సిర్పూర్ టి మండలాల్లో మూడు రోజులపాటు అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పక్షుల సందడి బర్డ్ వాచ్ ఫెస్టివల్లో పాల్గొన్న వారికి ఈరోజు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్, కాగజ్ నగర్ డివిజనల్ అధికారి సుఖదేవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వలస వచ్చిన 100కు పైగా పక్షి జాతులను వీక్షించేందుకు ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పక్షి ప్రేమికులు హాజరయ్యారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ఉత్సవాలు నిన్న ముగిశాయి. మంచిర్యాల జిల్లాలోని కవ్వాల్ టైగర్ జోన్ లో రెండు రోజుల పాటు నిర్వహించిన బర్డ్ వాచ్ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారని జన్నారం రేంజ్ అటవీశాఖ అధికారి సుస్మా రావు ఒక ప్రకటనలో తెలిపారు.

పిటిసి, ఆసిఫాబాద్, మంచిర్యాల

**మైలారం**

నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారంలో గనుల తవ్వకాలను వ్యతిరేకిస్తూ రైతులు ఈరోజు నుంచి రిలే నిరాహార దీక్షలకు సిద్ధమైన నేపథ్యంలో ముందస్తుగా పలువురు రైతులు , స్థానికులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ గ్రామానికి చెందిన

రైతులను అక్రమంగా అరెస్ట్ చేశారని.. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున మహిళలు, రైతులు నిరసనకు దిగారు. అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. పురుగుల మందు డబ్బాతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. మరోవైపు మైలారంలో స్థానికులకు మద్దతు తెలిపేందుకు పౌరహక్కుల నేతలు ప్రొఫెసర్ హరగోపాల్ , గడ్డం లక్ష్మణ్ హైదరాబాద్ నుంచి బయల్దే రారు. కానీ వారిని మార్గ మధ్యమంలో వెల్దండ వద్ద పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు

డెస్క్

**సర్వే**

రైతుభరోసా, రేషన్ కార్డులు , ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలు అర్హులకే అందేలా చర్యలు తీసుకుంటామని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. భిమారం మండల కేంద్రంతో పాటు అరెపల్లి , అంకుషాపూర్ గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో జరుగుతున్న సర్వే తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రేషన్ కార్డులకు అర్హత ఉండి జాబితాలో పేర్లు రాని వారు ఆందోళన చెందవద్దని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరిస్తున్నామని , ఇప్పటి వరకు 35 వేల 956 రేషన్ కార్డులలో అదనపు సభ్యుల నమోదు కొరకు దరఖాస్తులు అందాయని వివరించారు.

పిటిసి, మంచిర్యాల

**ఎంఆర్సీ నిధులు**

విద్యా వ్యవస్థ బలోపేతానికి ఏర్పాటుచేసిన MRC - మండల మానవ వనరుల కేంద్రం , విద్యాశాఖ అధికారి కార్యాలయాలకు ఈ విద్యా సంవత్సరానికి నిధులు విడుదలయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని 28 ఎమ్మార్సీలకు 11.6 లక్షల రూపాయలు విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఒక్కో MRC కి 41 వేల 460 రూపాయలు

నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. ప్రతి విద్యా సంవత్సరానికి ఒక్కో MRCకి 82 వేల 920 రూపాయలు ప్రభుత్వం కేటాయిస్తుంది. ఈ నిధులతో మండల విద్యాశాఖ కార్యాలయంలో స్టేషనరీ , ఇంటర్నెట్, కార్యాలయ నిర్వహణ ఖర్చులు , విద్యుత్, ఫర్నిచర్ నిమిత్తం ఆయా మండల విద్యాశాఖ అధికారులు ఈ నిధులు వినియోగించుకుంటారు.

PTC, SANGAREDDY